సాక్షి
మెదక్

బుధవారం । 26 । జూలై । 2023



వానొస్తే.. నరకమే..!

మోడల్ మున్సిపాలిటీ గజ్వేల్–ప్రజ్ఞాపూర్ వానొస్తే వణికిపోతుంది. చిన్న వర్షానికే అంతర్గత రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. 8లో



వ్యర్థాలతో కుళ్లిపోతున్న పంటలు

కోళ్ల ఫారమ్ వ్యర్థాలను బయటకు వదలడంతో వర్షపు నీటి ద్వారా పొలాల్లో చేరి పంటలు కుళ్లిపోతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. 9లో

అదనపు కలెక్టర్‌గా రమేశ్

మెదక్ కలెక్టరేట్: జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా జి.రమేశ్‌ను నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లాలో (రెవెన్యూ) అదనపు కలెక్టర్‌గా పని చేసిన రమేశ్ ఇటీవల బదిలీపై హైదరాబాద్‌కు వెళ్లారు. కాగా ఆయన తిరిగి మెదక్‌కు అదనపు కలెక్టర్‌గా నియమితులయ్యారు.

న్యూస్‌రీల్

ఈవీఎంలపై అవగాహన తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ అంబదాస్

హవేళీఘనపూర్: ఓటు హక్కు కలిగిన ప్రతీ ఒక్కరు ఈవీఎంలపై అవగాహన కలిగి ఉండాలని మెదక్ ఆర్డీఓ అంబదాస్ అన్నారు. మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో మంగళవారం ఈవీఎంలపై గ్రామస్తులు, యువతకు వివరించారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని, బీఎల్ఓలకు వివరాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెన్నాగౌడ్, ఆర్ఐ మహేశ్, సెక్రెటరీ కవిత, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

రేపు టీఎన్జీఓ కార్యవర్గ సమావేశం

మెదక్‌జోన్: పట్టణంలోని టీఎన్జీఓ భవన్‌లో ఈ నెల 27న జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొంత నరేందర్, రాజ్‌కుమార్ తెలిపారు. సమావేశంలో కారుణ్య నియామకాలు, ఉద్యోగుల పెండింగ్ బిల్లులు, పీఆర్సీ, 317 జీఓ బదిలీలు, సభ్యత్వ నమోదుపై చర్చ ఉంటుందన్నారు. సమావేశానికి జిల్లాలోని అన్ని యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు హాజరవుతారని పేర్కొన్నారు.

పంటల పరిశీలన



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

టేక్మాల్(మెదక్): సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి సాధించవచ్చని తునికి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తలు రవికుమార్, ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని కుసంగి గ్రామంలో పత్తి, వరి, మొక్కజొన్న పంటలను మంగళవారం పరిశీలించారు. వరి పొలాలు, మొక్కజొన్న, పత్తి మొక్కల సాళ్ల మధ్య నీరు నిలిస్తే తెగుళ్లు ఏర్పడి పంట నష్టపోతారని, సస్యరక్షణ చర్యలు పాటించాలన్నారు. కార్యక్రమంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం సీఈఓ డాకూరి వెంకటేశం, రైతులు ఉన్నారు.

పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

రామాయంపేట(మెదక్): పెండింగ్ కేసులపై విచారణ వేగవంతం చేయాలని ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని అన్నారు. నార్సింగి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను మంగళవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ: మెదక్‌లోని భరోసా సెంటర్‌లో లీగల్ సపోర్ట్ పర్సన్ పోస్టుకు జిల్లాలోని మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్పీ రోహిణి ప్రియదర్శిని ఓ ప్రకటనలో తెలిపారు. ఏడాది కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేసేందుకు కౌన్సెలింగ్‌లో అనుభవంతో పాటు ఎంఎస్సీ,/ఎంఏ సైకాలజీ లేదా మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ చేసి, 30–40 మధ్య వయసు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలను 9014052175 నంబర్‌కు వాట్సాప్ ద్వారా ఈ నెల 31వ తేదీలోగా పంపించాలన్నారు.

నష్టం మిగిల్చిన వర్షం

జిల్లాలో కూలిన 464 పాత ఇళ్లు

- విరిగిన 149 విద్యుత్ స్తంభాలు
- విద్యుత్ శాఖకు రూ.15 లక్షల ఆస్తి నష్టం
- దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు



పల్వంచలో కూలిన ఇంట్లో నీటిని ఎత్తుతున్న దృశ్యం



చిలప్‌చెడ్‌లో విరిగిన విద్యుత్ స్తంభం



మెదక్ పట్టణంలో గుంతలమయంగా రోడ్డు

మెదక్‌జోన్: జిల్లా వ్యాప్తంగా ఐదు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు పొంగిపొర్లుతుండగా ఘణపురం, మంజీరా, హల్దీ ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. కాగా ఈదురుగాలులకు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగి పడగా, పలు చోట్ల చెట్లకొమ్మలు కూలడంతో ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. వర్షాలకు పాత, శిథిలావస్థలో ఉన్న ఇళ్లు నేలకూలగా, పత్తి, వరి పంటల్లో వరద నీరు చేరి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

52సెంటీమీటర్ల వర్షపాతం..

ఈ ఏడాది 52 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు కురిసిన వర్షానికి జిల్లాలోని ఆయా గ్రామాల్లో 464 ఇండ్లు కూలిపోయి చాలామంది నిరాశ్రయులయ్యారు. ఈదురుగాలుల ధాటికి 149 విద్యుత్ స్తంభాలు విరిగాయి. విద్యుత్ తీగలు తెగిపడి మూడు పాడి గేదెలు మృత్యువాతపడ్డాయి. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, కల్వర్టులు దెబ్బతినగా, మట్టి రోడ్లు బురదమయమయ్యాయి. చెరువులు, కుంటలు నిండి వరద నీరు రోడ్లపైకి చేరి వాహనాల రాకపోకలకు అడ్డంకిగా మారింది. గిరిజన ప్రాంతాల్లోని మట్టిరోడ్లపై ఏర్పడిన గుంతలతో నడవలేని దుస్థితి నెలకొంది. చిన్నశంకరంపేట మండలంలోని మీర్జాపల్లిలో 4 విద్యుత్ స్తంభాలు, జంగరాయి గ్రామంలో 4, పాపన్నపేట మండలం పొడ్చన్‌పల్లి 5, గాంధారిపల్లిలో 4, తూప్రాన్ మండలంలోని దాతర్‌పల్లిలో 2, కాప్టాపూర్‌లో 3, బ్రాహ్మణపల్లిలో 1, ఇస్లాంపూర్‌లో 1, చిలప్‌చెడ్ మండల కేంద్రంలో 2, శీలంపల్లి 1, రైస్‌గూడలో రెండు విద్యుత్ స్తంభాలు విరిగాయి.



చిల్వెర ప్రాథమిక పాఠశాలలో పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

బిల్లుల బాధ్యత నాదే

నెల రోజుల్లో పనులు పూర్తి చేయండి • 'మనబడి' కాంట్రాక్టర్లకు కలెక్టర్ భరోసా

అల్లాదుర్గం(మెదక్): మన ఊరు–మన బడి పనులు నెల రోజుల్లో పూర్తి చేస్తే బిల్లులు చెల్లించే బాధ్యత తనదని కలెక్టర్ రాజర్షిషా కాంట్రాక్టర్లకు హామీ ఇచ్చారు. మంగళవారం అల్లాదుర్గం మండలం చిల్వెర ప్రాథమిక పాఠశాల, అల్లాదుర్గం బాలికల జెడ్పీ పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత కొరవడితే చర్యలు తప్పవని, ఏదైనా ఇబ్బందులు ఉంటే తహసీల్దార్, ఎంపీఓ దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. జిల్లాలో రూ.24 కోట్లతో పనులు చేపట్టగా, రూ.21 కోట్లు ఇప్పటికే చెల్లించామని, పెడింగ్‌లో ఉన్న రూ.3 కోట్ల బిల్లులను కూడా త్వరలో చెల్లిస్తామని భరోసా ఇచ్చారు. అల్లాదుర్గంలో రూ.30 లక్షలతో చేపట్టిన పల్లె దవాఖానా భవనం పనులు త్వరగా పూర్తి చేయించాలని జిల్లా వైద్యాధికారి చందు నాయక్, పీఆర్ డీఈఈకి ఆదేశించారు. ఆయనతో తహసీల్దార్ తులసీరాం, ఎంఈఓ బుచ్చానాయక్, ఎంపీడీఓ శంకర్, సర్పంచ్ అంజయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాత ఇళ్లను ఖాళీ చేయాలి

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజర్షిషా ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా, మండలస్థాయి అధికారులు, సిబ్బంది హెడ్‌క్వార్టర్‌లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పాత ఇండ్లలో ఎవరూ ఉండొద్దని, తాత్కాలిక పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. వర్షాలకు తడిసి ఉన్న కరెంట్ స్తంభాలను ముట్టుకోవద్దని, సీజనల్ వ్యాధులు రాకుండా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వీధులు, మురికి కాల్వల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయాలన్నారు. అత్యవసర సేవలకు కంట్రోల్ రూమ్ 9391942254 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి 79016 77782లో సంప్రదించాలన్నారు.

సామర్థ్యాల సాధనకే తొలిమెట్టు

డీఈఓ రాధాకిషన్



మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

మెదక్ కలెక్టరేట్: విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు సాధించడం తొలిమెట్టు ప్రధాన లక్ష్యమని డీఈఓ రాధాకిషన్ అన్నారు. ఫండమెంటల్ లిటరసీ న్యూమరసీ(తొలిమెట్టు) కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 150 మంది రిసోర్స్ పర్సన్‌లకు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ సభ్యులు సురేష్ బృందంతో కలిసి డీఈఓ శిక్షణా కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. విద్యార్థులకు తెలుగు, గణితం, ఆంగ్లంలో కనీస సామర్థ్యం పెంపొందేలా టీచర్లు బోధన చేయాలన్నారు. ఆకర్షణీయమైన వర్క్ బుక్కులు, ఉపాధ్యాయులకు పాఠ్య ప్రణాళికల పుస్తకాలు అందించారు. జిల్లాస్థాయి అనంతరం మండల స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుదర్శన్ మూర్తి, రాష్ట్ర పరిశీలకులు ప్రసన్న, డీఆర్పీలు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పక్కాగా ఉండాలి

కొల్చారం(నర్సాపూర్): అర్హులైన ప్రతీ ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని, బీఎల్‌ఓలు ఓటరు జాబితా పకడ్బందీగా చేపట్టాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ కిశోర్ సూచించారు. మండలంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో మంగళవారం బూత్ లెవెల్ ఆఫీసర్లకు ఓటర్ నమోదుపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూత్ స్థాయిలో 18 ఏళ్లు నిండిన వారిని ఓటరుగా నమోదు చేయించాలని, యువతకు ప్రత్యేకంగా అవగాహన కల్పించాలన్నారు. శిక్షకులు సత్యనారాయణ, ప్రభాకర్ రెడ్డి, లక్ష్మీనారాయణ ఓటరు నమోదుపై పలు విషయాలను వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రభాకర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



బీఎల్‌ఓలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఉద్యాన పంటలపై దృష్టి సారించాలి

కలెక్టర్ రాజర్షి షా

మెదక్ కలెక్టరేట్: రైతులు ఉద్యాన పంటలపై దృష్టి సారించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యాన, అటవీ, ఎంపీడీఓ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1,542 ఎకరాల్లో ఉద్యాన, ఆయిల్‌పామ్ సాగు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం, చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం రాయితీ కల్పిస్తుందన్నారు. ఆసక్తి గల రైతులు ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చిన్న, సన్నకారు రైతులు సాగుచేసేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. బండ్ ప్లాంటేషన్, బ్లాక్ ప్లాంటేషన్ చేపట్టాలన్నారు. ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా చూడాలని వైద్యశాఖ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా అటవీ అధికారి రవిప్రసాద్, జెడ్పీ సీఈఓ శైలేష్, డీపీఓ సాయిబాబా, పంచాయతీ రాజ్ ఈఈ సత్యనారాయణ రెడ్డి, ఎంపీడీఓలు, ఉద్యాన అధికారి నర్సయ్య, అటవీ అధికారులు పాల్గొన్నారు.

బాలిక మృతిపై బాధ్యత వహించాలి



వరినాటు వేసి నిరసన తెలుపుతున్న నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని మహ్మద్‌నగర్ పంచాయతీ పరిధి పెద్దమ్మగడ్డ తండాలో గిరిజన బాలిక మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ప్రకాశ్ రాథోడ్ డిమాండ్ చేశారు. మంగళవారం బాలిక కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థికసాయం అందించారు. అనంతరం మాట్లాడుతూ రవాణా సౌకర్యం లేక సకాలంలో వైద్యం అందక బాలిక అక్షర కుటుంబాన్ని మృతిచెందిందని ఆరోపించారు. తండావాసులతో కలిసి మట్టిరోడ్డుపై వరినాటు వేసి నిరసన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. ఆయనతో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్, రంజిత్ నాయక్, శ్రీనివాస్ నాయక్, పెంట్యానాయక్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగిరం చేయాలి

గడా ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి



మాట్లాడుతున్న గడా ముత్యంరెడ్డి

తూప్రాన్: గజ్వేల్ నియోజకవర్గంలోని తూప్రాన్, మనోహరాబాద్ ఉమ్మడి మండలాల్లో అభివృద్ధి పనులు వేగిరం చేయాలని గడా ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉమ్మడి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టాల్సిన సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వైకుంఠధామాలు, తదితర అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని, గడా నుంచి నిధులు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించి పురోగతిని పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



బురదమయం.. కళాశాల ప్రాంగణం

వర్షాలకు పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణం బురదమయంగా మారింది. అందులో నుంచి నడవలేక విద్యార్థులు నానా ఇబ్బందులు పడ్డారు.

– మెదక్ మున్సిపాలిటీ



నవాబుపేట వీధిలో ఇళ్ల చుట్టూ చేరిన వరదనీరు

కాలనీలు జలమయం

మంగళవారం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి మెదక్ పట్టణంలో పలు కాలనీలు జలమయంగా మారాయి. ప్రధాన రోడ్లు, వీధుల్లో వరదనీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఫతేనగర్, చమన్ రోడ్డులో డ్రైనేజీలు పొంగి మురుగు నీరు రోడ్డుపైకి చేరింది.

భవితకు ఏదీ భరోసా?

- బడ్జెట్ లేక మూడేళ్లుగా నిలిచిన సేవలు
- జిల్లాలో 350 మంది దివ్యాంగులు
- ప్రశ్నార్థకంగా ప్రత్యేక అవసరాల పిల్లల భవిష్యత్



మెదక్ భవిత సెంటర్

మెదక్‌జోన్: మూగ, చెవిటితో పాటు ఇతర శారీరక లోపంతో జన్మించిన చిన్నారుల సంరక్షణకు జిల్లాలో ఏర్పాటు చేసిన భవిత సెంటర్లలో సేవలు నిలిచిపోయాయి. ప్రతీ రోజు వీరిని కేంద్రాలకు తీసుకవచ్చేందుకు సరైన రవాణా సదుపాయం లేకపోవడంతో కేంద్రాల్లో అందించే ఫిజియో, స్పీచ్ థెరపీ చికిత్స దూరమవుతోంది. సెంటర్ల నిర్వహణకు మూడేళ్లుగా నిధులు రాకపోవడంతో చిన్నారులు కేంద్రాలకు రావడంలేదు. దీంతో వీరి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది.

మూడు కేంద్రాలు..

జిల్లావ్యాప్తంగా శారీరక వికలాంగులు 350 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరికోసం ప్రత్యేకంగా మెదక్, నర్సాపూర్, కౌడిపల్లిలో మూడు భవిత సెంటర్లను ఏర్పాటు చేశారు. కేంద్రాలకు వచ్చిన పిల్లలకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ చేసి, బొమ్మలు, రంగులను గుర్తించేలా శిక్షణ అందించేవారు. వారానికోసారి నిపుణుల ఆధ్వర్యంలో ఫిజియోథెరపీతో పాటు ఆసనాలు వేయించేవారు. సెంటర్లలో ఆయాతో పాటు కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్(సీఆర్‌పీ) ఆక్టీవిస్టులకు సైతం ఫిజియోథెరపీపై శిక్షణ అందించేవారు. సీఆర్‌పీలు గ్రామాల్లో పర్యటించి ప్రతీ 15 రోజులకోసారి భవిత సెంటర్ పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి వారి అవసరాలపై చర్చించేవారు.



చిన్నారికి ఫిజియోథెరపీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

రవాణా సౌకర్యం లేక..

మెదక్, నర్సాపూర్, కౌడిపల్లిలో మూడు భవిత సెంటర్ల పరిధిలో పిల్లలను భవిత సెంటర్లకు తీసుకువెళ్లేందుకు గతంలో మూడు ఆటోలను ఏర్పాటు చేశారు. సెంటర్‌కు పిల్లలను తీసుకురావడం, ఫిజియోథెరపీ అనంతరం అదే ఆటోలో ఇళ్ల వద్ద వదిలిపెట్టినందుకు గాను నెలకు రూ.20 వేల చొప్పున అద్దె ఇచ్చేవారు. ఇలా జిల్లాలోని మూడు సెంటర్లకు సుమారు రూ.60వేల నిర్వహణ కింద ఖర్చు అయ్యేది. కాగా మూడేళ్లుగా ప్రభుత్వం నుంచి బడ్జెను నిలిపివేయడంతో రవాణా సౌకర్యం లేక సెంటర్‌కు పిల్లలు రావటం లేదు. గతంలో రోజుకు ఒక్కో సెంటర్లలో 50 మంది పిల్లలు ఉండగా, ప్రస్తుతం సెంటర్ పరిసరాల్లో ఉన్న ఇద్దరు ముగ్గురు మాత్రమే వస్తున్నారు. ప్రభుత్వం స్పందించి భవిత సెంటర్లకు నిధులు అందించి పూర్వవైభవం తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

గతంలో ఒక్కో భవిత సెంటర్‌కు 50 మంది వచ్చేవారు. నిధుల సమస్యతో రవాణా సౌకర్యం లేక దివ్యాంగ పిల్లలు సెంటర్లకు రావటంలేదు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– మోహన్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్

క్లుప్తంగా

మందుబాబులకు జరిమానా, జైలు

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానాతో పాటు ఒకరికి జైలు శిక్ష విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో కార్యాలయ చౌరస్తా, రాజీవ్ రహదారిపై వారం రోజుల నుంచి సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 13 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట ద్వితీయశ్రేణి న్యాయమూర్తి రమేష్ బాబు ఎదుట మంగళవారం హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి 13 మందికి రూ.28వేలు జరిమానా, వారిలో ఒకరికి ఐదు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి


గేదె కళేబరం

హుస్నాబాద్‌రూరల్: పొట్లపల్లి గ్రామానికి చెందిన జొన్నగడ్డల రాజుకు చెందిన పాడి గేదెను మంగళవారం మేతకు తీసుకెళ్లగా అక్కడ ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురై మృత్తి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. పాల ఉత్పత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రాజు గేదె మరణించడంతో రూ.70వేల వరకు నష్టం జరిగినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. విద్యుత్ శాఖ అధికారులు ఆర్థిక సాయం అందజేసి రైతును ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి గడిపె మల్లేశ్ డిమాండ్ చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- రూ.30వేలు అపహరణ


సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని సముద్రాల గ్రామంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్‌ఐ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన విఠల బోయిన లింగమ్మ ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లింది. తిరిగొచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉండడాన్ని గమనించింది. వెంటనే ఇంట్లో వెళ్లి చూసింది. బీరువాలో ఉన్న రూ.30వేలు ఎత్తుకెళ్లారని పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి ఇంటికి వెళ్లి విచారణ చేశారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


ఇబ్రహీం మృతదేహం

రామాయంపేట(మెదక్): పంటకు నీరు పారించడానికి వెళ్లిన యువరైతు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఎస్‌ఐ రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం..రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన షేక్ ఇబ్రహీం(26) రెండెకరాలపొలంలో వరి వేశాడు. ఈ క్రమంలో వరి చేనుకు నీరు పారించడానికి మంగళవారం సాయంత్రం బోరువద్దకు వెళ్లి స్టార్టర్ ఆన్ చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య మంతాజ్, తల్లి ఉన్నారు. తల్లి షేక్ అమీనా ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నాని పేర్కొన్నారు.

వానొస్తే.. నరకమే..!

మోడల్ మున్సిపాలిటీగా చెప్పుకుంటున్న గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ వానొస్తే వణికిపోతుంది. అంతర్గత రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. వరద నీరు సక్రమంగా వెళ్లక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. సీసీ రోడ్లకు ఇటీవల రూ.120కోట్ల ప్రతిపాదనలు పంపితే కేవలం 20శాతం నిధులు మంజూరు చేశారు. దీంతో పట్టణ అవసరాలకు 25శాతం మాత్రమే నిర్మాణ పనులు జరగడంతో ఈ దుస్థితి నెలకొంది. వరద కాల్వల నిర్మాణానికి నీటిపారుదల శాఖ ప్రతిపాదించిన రూ.15కోట్ల వ్యవహారం కూడా కొలిక్కిరాలేదు. ఫలితంగా పట్టణ ప్రజలకు ఏళ్లతరబడి ఇక్కట్లు తప్పడం లేదు.
ఈ వ్యవహారంపై కథనం..


గజ్వేల్‌లోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ రోడ్డు

- వరద కష్టాలు యథాతథం
- అంతర్గత రోడ్లు ఛిద్రం
- రూ.120కోట్ల ప్రతిపాదనలకు రూ.22.87కోట్లు మంజూరు
- వరద కాల్వల పనులు పెండింగ్‌లోనే..

ప్రజల ఇబ్బందులు తీరుస్తాం



మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల ఇబ్బందులు తీర్చడానికి కృషి చేస్తాం. 20వార్డుల్లో పూర్తిస్థాయిలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.120కోట్లకుపైగా ప్రతిపాదనలు పంపింది నిజమే. కానీ రూ.22.87కోట్ల నిధులు మాత్రమే మంజూరయ్యాయి. వరద కాల్వలకు సంబంధించిన రూ.15కోట్ల ప్రతిపాదనలు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమస్యను సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం. – గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి

గజ్వేల్: భారీ వర్షాలొస్తే గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు వర్ణనాతీతం. ప్రత్యేకించి అంతర్గత రోడ్లలో అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి నెలకొంది. మున్సిపాలిటీ పరిధిలోని 20వార్డుల్లో కొన్ని చోట్ల మినహా చాలావరకు కాలనీల్లోని రోడ్లు గుంతలమయంగా మారాయి. తొలుత మిషన్ భగీరథ పనులు, ఆ తర్వాత యూజీడీ పనులు చేపట్టడంతో రోడ్లు మరింతగా ధ్వంసమయ్యాయి. దీంతో మున్సిపాలిటీ పరిధిలో సుమారుగా 80కిలోమీటర్ల పొడవునా సీసీ రోడ్లకు రూ.120 కోట్ల నిధులు అవసరమని ప్రతిపాదిస్తే ఇందులో కేవలం రూ. 22.87కోట్లను మాత్రమే ప్రభుత్వం విడదల చేసింది. ఫలితంగా 18కిలోమీటర్ల మేర మాత్రమే పనులు చేపడుతున్నారు. మిగితా చోట్ల పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. పట్టణంలోని లక్ష్మీప్రసన్ననగర్ కాలనీ, భారత్‌నగర్, క్యాసారం, ముట్రాజ్‌పల్లి, ప్రజ్ఞాపూర్‌లోని పలు వార్డుల్లో అంతర్గత రోడ్లు నరకాన్ని తలపిస్తున్నాయి. ఇకపోతే గజ్వేల్–ప్రజ్ఞాపూర్ రహదారికి సైతం ఏటా వరదముప్పు తప్పడం లేదు. ప్రధానంగా ప్రజ్ఞాపూర్ ఊరచెరువు మత్తడి దుంకితే ఆ నీరు వెళ్లడానికి అవసరమైన నాలాల వ్యవస్థ లేదు. నిజానికి ఈ వరద నీరు నాలాల ద్వారా రాజిరెడ్డిపల్లి కుంటలోకి అక్కడి నుంచి క్యాసారం చెరువులోకి వెళ్లాల్సి ఉంటుంది. కానీ నీరు వెళ్లే మార్గం లేక అక్కడి నుంచి ఇళ్ల మధ్యకు చేరుతుంది. అదేవిధంగా ఎర్రకుంట నుంచి పాండవుల చెరువు ఫీడర్ చానెల్ నిర్మాణానికి మరో రూ.2కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ రెండు ప్రతిపాదనలకు ఆమోదం వస్తేనే పట్టణంలో వరద ముప్పునకు పరిష్కారం లభిస్తుంది. కానీ ప్రతిపాదనలకు ఏళ్లతరబడి మోక్షం లేకపోవడంతోనే ఏటా వరద కష్టాలు పరిపాటిగా మారాయి.

కూలిన ఇల్లు

- తృటిలో తప్పిన ప్రమాదం


కూలిన ఇల్లు

రామాయంపేట(మెదక్): నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నార్సింగి మండలం నర్సంపల్లిలో మంగళవారం తెల్లవారుజామున మహమ్మద్ పాషా ఇల్లు కూలిపోయింది. అదృష్టవశాత్తు వారు పడుకున్న గది కూలలేదు. పక్కగది పైకప్పు కూలడంతో పెను ప్రమాదం తప్పిందని వారు వాపోయారు.దీంతో తనను ఆదుకోవాలని ప్రభుత్వాని కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ రామ్ మోహన్ తెలిపిన వివరాల ప్రకారం..పటాన్‌చెరు బస్టాండ్ సమీపంలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతిచెంది కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఏఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాట్లు అమ్ముతానని డబ్బులు తీసుకొని..

- తప్పించుకు తిరుగుతున్న వ్యక్తి అరెస్ట్


పోలీసుల అదుపులో నిందితుడు

నర్సాపూర్: ఓ వెంచర్‌లో ప్లాట్లు అమ్ముతానని డబ్బులు తీసుకుని ప్లాట్లు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం..జిన్నారం మండలంలోని చెట్లపోతారం గ్రామ శివారులో వివిఆర్ హౌసింగ్ సొసైటీ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి చెందిన వాక వాసుదేవరావు బాచుపల్లి ప్యారడైజ్ డీలక్స్ పేరిట 2012 సంవత్సరంలో వెంచర్ ప్రారంభించారు. ఈ వెంచర్‌లో గజానికి రూ.2,700లు ధర నిర్ణయించగా అప్పట్లో పలువురు డబ్బులు చెల్లించారు. అయినప్పటికీ వారికి అప్పట్లో ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయలేదన్నారు. కొనుగోలు దారులకు రిజిస్ట్రేషన్ చేయకుండా తప్పించుక తిరుగుతున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన జగన్‌మోహన్ రావు రూ.8,59,293లు, మియాపూర్‌కు చెందిన శ్రీనివాస్ రూ.2,39,693లు, కేపీహెచ్‌బికి చెందిన శైలజ రూ.6,52,320లు, అదే ప్రాంతానికి చెందిన ప్రశాంత్ రూ.6,52,232లు వాకా వాసుదేవరావుకు చెల్లించామన్నారు. వారికీ తమ తమ ప్లాట్లు కేటాయించలేదన్నారు. దీంతో వారు నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు విచారణానంతరం నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్ తరలించారని పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి


ఆకాశ్ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. ఏఎస్‌ఐ సురేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఏపీలోని గుంటూరు జిల్లా, బాపట్ల మండలం నరసాయపాలానికి చెందిన భూషణం బతుకుదెరువు కోసం హైదరాబాద్ జగద్గిరిగుట్టకు వచ్చి భార్య మెర్సీవరదానం ఇద్దరు పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. అయితే వీరి కుమారుడు ఆకాశ్(22) డెకరేషన్ వర్క్ చేస్తుంటాడు. ఈ క్రమంలో 21న రాత్రి 10 గంటల సమయంలో ఆకాశ్ తనతో పనిచేసే శ్రావణ్‌లు భోజనం కోసం లింగంపల్లి నుంచి సంగారెడ్డి వైపునకు స్కూటీపై వెళ్లారు. పటాన్‌చెరు మండలం ముత్తంగి సమీపంలోకి రాగానే ఆకాశ్ బ్రేక్ వేయడంతో ప్రమాదవశాత్తు కింద పడి తీవ్రగాయాలయ్యాయి. వెనుకాల కుర్చున్న శ్రావణ్‌కు ఎడమ చేతికి గాయం కావడంతో వారిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఆకాశ్‌కు ప్రథమ చికిత్స అనంతరం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారుణ్య ఆస్పత్రిపై కొరడా..

- శిశువు మృతిపై విచారణ
- ఆసుపత్రి సీజ్


ఆసుపత్రిని సీజ్ చేస్తున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో అనుమతుల్లేకుండా ఆసుపత్రుల్లో డెలివరీలు చేయటంపై మంగళవారం జిల్లా వైద్యాధికారులు విచారణ చేపట్టారు. పురిటినొప్పులు వస్తున్న సమయంలో ఓ మహిళకు ఓ ఆసుపత్రి వైద్యులు డెలివరీ చేయటంతో శిశువు మృతి చెందిన ఘటనపై డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ నాగనిర్మల విచారణ జరిపారు. ఫస్ట్ ఎయిడ్ ఆసుపత్రి వైద్యులు డెలివరీలు చేయటం చట్టరీత్యా నేరమని వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శిశువు మృతికి కారణమైన కారుణ్య ఆసుపత్రిని అధికారులు సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొల్లారం ఆసుపత్రి వైద్యురాలు రాధిక, సిబ్బంది పాల్గొన్నారు.

కార్డన్ సర్చ్


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ శ్రీధర్

మనోహరాబాద్(తూప్రాన్): గౌతోజీగూడెంలో తూప్రాన్ సీఐ శ్రీధర్ మంగళవారం కార్డన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వాహనాల పత్రాలను తనిఖీ చేశారు. గ్రామస్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పని సరిగా వాడాలన్నారు. మైనర్లు వాహనాలు నడపొద్దన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, అనుమానితులుంటే తమకు సమాచారమివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు సురేశ్, సందీప్‌రెడ్డి, మహేందర్, సిబ్బంది, సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ రేణు కుమార్ పాల్గొన్నారు.

డ్యూటీకని బైక్‌పై వెళ్తూ..

- బస్సు ఢీకొని సూపర్‌వైజర్ మృతి


రమేశ్

మనోహరాబాద్(తూప్రాన్): డ్యూటీకని బైక్‌పై వెళ్తున్న యువకుడిని బస్సు ఢీ కొన్న సంఘటనలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎస్‌ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..భద్రాద్రి–కొత్తగూడెం జిల్లా పాల్వంచ పాండురంగాపురం గ్రామానికి చెందిన వింజం రమేశ్(39) కొంపల్లిలో ఉంటున్నాడు. కాగా మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులోని ప్రైమా ఫుడ్‌టెక్ పరిశ్రమలో నాలుగు సంవత్సరాలుగా సూపర్ వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం కొంపల్లి నుంచి తన బైక్‌పై ప్రైమా ఫుడ్‌టెక్‌లో డ్యూటీకని బయలుదేరాడు. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామ శివారులోకి రాగానే ఇండియన్ పెట్రోల్ పంపు ఎదురుగా జాతీయ రహదారి–44పై ముప్పిరెడ్డిపల్లి వైపుగా వెళుతున్నాడు. అదే సమయంలో విజయసాయి లాబొరేటరీస్ సంస్థకు చెందిన బస్సు ముందు వెళుతున్న రమేశ్ బైక్‌ను ఢీకొట్టింది. తీవ్రగాయాలైన అతణ్ని చికిత్సనిమిత్తం ప్రవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

అత్యాచార నిందితుడిపై కేసు

హవేళీఘనపూర్: ఓ బాలికను మోసం చేసిన యువకుడిపై పోక్సోచట్టం కింద కేసు నమోదు చేసినట్లు హవేళీఘనపూర్ పోలీసులు మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి..వడియాం గ్రామానికి చెందిన ఓ యువకుడు మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలికను నమ్మించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ మేరకు నిందితుడిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

రెండు బైక్‌లను ఢీకొన్న కారు

- నలుగురికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రుడు

మునిపల్లి(అందోల్): కంకోల్ వద్ద కారు రెండు బైక్‌లను ఢీకొట్టడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి..బుధేరా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సదాశివపేట మండలంలోని లోపలికోట గ్రామానికి చెందిన దశరథ్ తన భార్య రుక్మిణి, కుమార్తె వైష్ణవితో యాక్టివా బైక్‌పై జహీరాబాద్ నుంచి సదాశివపేట వైపు వెళుతుండగా కంకోల్ టోల్ గేటు వద్ద వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఇదే క్రమంలో మరో బైక్‌ను ఢీకొట్టడంతో హైదరాబాద్‌కు చెందిన షబ్బీర్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వారిని వైద్యం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వెదసాగుతో లాభాలు

దుబ్బాకరూరల్: మండలంలోని గంభీర్‌పూర్, ధర్మాజీపేట, హబ్సీపూర్ గ్రామాల్లో వెదసాగులో సాగుచేస్తున్న పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ మాట్లాడుతూ.. వెదజల్లడంతో కూలీల కొరత తప్పుతుందన్నారు. పొలాన్ని తక్కువ శాతం దున్నడంతో ట్రాక్టర్ ఖర్చులు తప్పుతాయని, రసాయనిక ఎరువులు కూడా తక్కువగా పడతాయన్నారు. రైతుబీమాకు సంబంధించి రైతులు తమ నామినీ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు రైతులు సంబంధిత ఏఈఓలను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓలు సురేందర్, మహేశ్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురి అదృశ్యం

నా భర్త ఆచూకీ తెలపండి


జంగయ్య (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..జిన్నారం మండలం కాజిపల్లికి చెందిన జంగయ్య, సావిత్రి భార్యాభర్తలు. వారు ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసుకుంటూ జీవనం సాగించేవారు. నాలుగు సంవత్సరాల క్రితం జంగయ్య తన భార్య సావిత్రితో గొడవపడి సుల్తాన్‌పూర్ సమీపంలోని గండిగూడ కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. మంగళవారం సావిత్రి తన భర్త కోసం వెళ్లి చూడగా స్థానికులు గత పదిహేను రోజులుగా జంగయ్య కనిపించడం లేదని చెప్పారు. దీంతో ఆందోళనకు గురైన సావిత్రి భర్త కోసం తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. సావిత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనస్పర్థలతో భార్య..


శ్వేతరాణి

భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో భార్య అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడా గ్రామ సమీపంలోని సృజన లక్ష్మినగర్‌కు చెందిన సురేశ్‌కుమార్ ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సురేష్ అతడి భార్య శ్వేతరాణి మధ్య గొడవలతో మనస్పర్థలు పెరిగాయి. ఈ క్రమంలో జూలై 14వ తేదీన ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా శ్వేతారాణి వెళ్లిపోయింది. దీంతో శ్వేత కోసం కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కూతురి అదృశ్యంపై తల్లి రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటాపూర్‌లో భర్తతో గొడవపడి

పటాన్‌చెరు టౌన్: వివాహిత అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కామారెడ్డి జిల్లా, ఎల్లారెడ్డి మండలం వెంకటాపుర్ గ్రామానికి చెందిన గొలపల్లి శ్రీకాంత్, భార్య లక్ష్మితో బతుకుదెరువు కోసం నాలుగు నెలల క్రితం పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండ గ్రామానికి వచ్చి వాచ్‌మెన్‌గా పనిచేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు పెరిగాయి. దీంతో లక్ష్మి 23వ తేదీ రాత్రి10 గంటల సమయంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. భార్య కోసం శ్రీకాంత్ తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభిందలేదు. దీంతో భార్య అదృశ్యంపై శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మల్కాపూర్‌లో వివాహిత


యాదమ్మ

తూప్రాన్: వివాహిత అదృశ్యమైన సంఘటన మల్కాపూర్ గ్రామంలో ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ సురేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..మేడ్చెల్ మండలం కండ్లకోయ గ్రామానికి చెందిన సామల యాదమ్మ(50) తూప్రాన్ మండలంలోని మల్కాపూర్‌లో ఉంటున్న కూతరు పల్లేపాటి సూజాత ఇంటికి ఈ నెల 19న వచ్చింది. 23న తెల్లవారుజామున కాల కృత్యాలకని ఇంటి నుంచి బయటి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

పంటల వివరాలు నమోదు చేసుకోవాలి


నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి ప్రియదర్శినీ

కొండపాక(గజ్వేల్): పంటల సాగు వివరాలు రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రియదర్శినీ పేర్కొన్నారు. కొండపాక మండలంలో పంటల నమోదు ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రియదర్శిణి మాట్లాడుతూ.. పంటల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. సాగు చేసిన పంటలను పట్టాదార్ పాస్ పుస్తకాలను తీసుకెళ్లి వ్యవసాయ విస్తరణాధికారుల వద్ద నమోదు చేసుకోవాలన్నారు. లేని పక్షంలో కొనుగోలు కేంద్రాల్లో పంటలను అమ్ముకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. రైతులు పంటలను నమోదు చేసుకునేలా స్థానిక ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ విష్ణు, రైతులు తదితరులు పాల్గొన్నారు.